క్లుప్తంగా

నేడు 'భూ భారతి'పై అవగాహన సదస్సు

కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు(గురువారం) భూ భారతి ఆర్ ఓఆర్–2025 రెవెన్యూ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు హాజరు కావాలని తెలిపారు.

రేపు ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: భూ భారతిపై అవగాహన సదస్సును ఈనెల 25న మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జగదీశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులు, నాయకులు, ప్రజలు తరలిరావాలని కోరారు.

కమిటీ ఎన్నిక



కన్నాయిగూడెం: మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం అడహాక్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ కమిటీని ఎన్నిక చేసినట్లు అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరి దీగొండ కాంతరావు, జిల్లా అధ్యక్షుడు నక్క భిక్షపతి తెలిపారు. మండల కన్వీనర్‌గా దుర్గం రాజేశ్, కో కన్వీనర్లుగా వాసంపెల్లి మధుకర్, గాందెర్ల అంజయ్య, కావిరి అంజయ్య, రమేష్‌లను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామ కమిటీలను ఎన్నిక చేసిన అనంతరం మండల పూర్తి కమిటీ ఎన్నక చేయనున్నట్లు తెలిపారు. రాంబాబు, కుంచర్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ..



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయంలో బుధవారం అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీని సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ కార్యదర్శి దిగొండ కాంతారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు నక్క భిక్షపతి ఆధ్వర్యంలో ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదరి మధు, ప్రధాన కార్యదర్శిగా వావిలాల కిషోర్, ఉపాధ్యక్షుడిగా బోయిరి శ్రీధర్, సహాయ కార్యదర్శిగా కందుకూరి రతన్, ప్రచార కార్యదర్శిగా దీపాక సాగర్, కోశాధికారిగా సాధన పల్లి రాజ్ కుమార్, సంస్కృతిక కార్యదర్శిగా రవికుమార్‌ను నియమించారు.

రామకోటి రాస్తున్న భక్తుడు



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో మండల కేంద్రానికి చెందిన బోయిరి ముత్తు(సిద్ధు) స్వామి ఆంజనేయస్వామి మాలను ధరించారు. ఈ దీక్ష సమయంలో రామకోటిని రాస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీక్ష పూర్తయ్యే వరకు రామకోటి రాసి భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అప్పగిస్తానని సిద్ధు తెలిపారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



రోడ్లపైకి నిలిచిన మురుగు నీరు



గుంతలమయంగా ఉన్న రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): వెంకటాపురం మేజర్ పంచాయతీ పరిధిలోని శివాలయం వీధిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్లతో ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివాలయం వీధిలోని రంగరాజాపురం పాఠశాల పక్కన, సమ్మక్క గుడి సెంటర్ గల రోడ్డు గుంతలమయంగా మారటంతో పాటు రోడ్లపైకి మురుగు నీరు చేరి ప్రజలు రోడ్డుపై నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకాంలోనే రోడ్లపైకి మురుగు నీరు చేరితే వర్షాకాలం వస్తే రోడ్డుపై నడవటం ఎలా అని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, సైడ్‌కాల్వలు తీయించాలని కాలనీవాసులు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే మురుగు నీరు

రోడ్లు గుంతలమయంగా ఉండటంతో పాటు సైడ్‌కాల్వలు లేక పోవంటతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో ఈ రోడ్డుపై నడిచేందకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైకి చేరిన మురుగు నీటిలో దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో ప్రజలు వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని ఇప్పటికైన పంచాయతీ, మండల అధికారులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతులు చేయించడంతో పాటు రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



శివాలయంలోని రోడ్లు గంతలమయంగా మారి నడిచేందుకు వీలుగా లేకుండా ఉన్నాయి. రోడ్డుపైకి రాత్రి సమయాల్లో వెళ్లాలంటే భయం వేస్తోంది. గుంతలో పడి ప్రమాధాల బారిన పడే అవకాశం ఉంది.అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– శ్రీను, గ్రామస్తుడు

అధికారులు దృష్టి సారించాలి



అధికారులు రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలి. గుంతల మయంగా ఉన్న రోడ్లుకు మరమ్మతులు చేయించాలి. రోడ్డుకు ఇరువైపులా సైడ్ కాలవలను ఏర్పాటు చేసి రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి.

– ఆదినారాయణ, గ్రామస్తుడు

పహల్గాం మృతులకు ఘన నివాళి



పస్రా చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఏటూరునాగారం: జమ్ము కాశ్మీర్‌లో పహల్గాంలో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు బుధవారం మండల కేంద్రంలో యువకులు, నాయకులు, గ్రామస్తులు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. మానవహారం చేపట్టి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల వెంకటాపురం(కె) చెందిన సామాజికవేత్త చిడెం సా యిప్రకాశ్ ఆత్మశాంతించాలని రెండు నిమి షాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

వాజేడు: ఉగ్రవాదులు శిక్షించాలని కోరుతూ మండల కేంద్రంలో స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాశ్మీర్‌లోని బైరసాన్, పహల్గాంలో ఆరు కిలో మీటర్ల దూరంలో పర్యాటకులను ఉగ్రవాదులు కిరాతకంగా హత్య చేయడాన్ని ఖండించారు. విక్రాంత్, కృష్ణారెడ్డి, దావూద్, జగన్నాథ రాజు, వరంబాబు రాజు, తిరుపతి, సూరిబాబు రాజు ఉన్నారు.

గోవిందరావుపేట: జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి మృతులకు పస్రా గ్రామస్తులు సంతాపం తెలిపారు. మండలంలోని పస్రా చౌరస్తాలో పలు పార్టీలకు సంబంధించిన నాయకులు, గ్రామస్తులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు.



ఏటూరునాగారం మానవహారంగా ఏర్పడి నివాళులర్పిస్తున్న నాయకులు



వాజేడు: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: గ్రామాలను అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని దళిత వాడలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన రూ.2.40కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ఉపాధ్యక్షుడు ఎండీ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లేశం

ములుగు రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకొని ఆంగ్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ఆంగ్ల విభాగాధిపతి కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో ఆంగ్ల భాషా సాహిత్యానికి ఎనలేని సేవ అందించిన మహోన్నత వ్యక్తి విలియం షేక్స్పియర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ భాస్కర్, అధ్యాపకులు నాగమణి, రాధిక, అనిల్‌కుమార్, విజేత, తేజోలత, లక్ష్మీ, ఎస్ కె షరిఫా, ఐలయ్య , రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో గ్రాడ్యుయేషన్ డే



బుర్రకథను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కాటారం: మండల కేంద్రంలోని కస్తూరి భాగాంధీ బాలికల పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. విద్యార్థినులకు ఎస్ఏ–2కి సంబంధించిన ప్రొగ్రెసివ్ రిపోర్ట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు స్వీయ కవితలు, కథలు, చిత్రలేఖనం, గోల్స్ చార్ట్‌రూపంలో ప్రదర్శన చేపట్టారు. బాల్యవివాహాలు అంశంపై ప్రిన్సిపాల్ చల్ల సునీత రచించిన బుర్రకథను తొమ్మిదో తరగతి విద్యార్థులు అక్షయ బృందం ప్రదర్శించారు. అనంతరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు విజయ, సరిత, అరుణ, సుజాత, మణిమాల, కవిత, రాజమణి, స్వప్న, శ్రీలత, శిరీష, నళిని, రాజేశ్వరీ, లక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల వానతో ఆగమాగం



తడిసిన మిర్చిని చూపుతున్న రైతులు



తీగలపై విరిగి పడిన చెట్టు



మరమ్మతు పనులను చేస్తున్న విద్యుత్ సిబ్బంది

- తడిసిన మిర్చి
- నిలిచిన విద్యుత్ సరఫరా

వాజేడు: మండల పరిధిలోని చింతూరు, లక్ష్మీపురం, అర్లగూడెం గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వాన మిర్చి రైతులను నట్టేట ముంచింది. వర్షం ప్రారంభం కావడం కావడమే వడగళ్లతో పడింది. దీంతో ఎండిన మిర్చి ముక్కలుగా విరిగి పోయాయి. భారీ వర్షం కురువడంతో కల్లాల్లో ఆరబోసిన కాయలు తడిసి ముద్దయ్యాయి. చింతూరు, లక్ష్మీపురం గ్రామాల మధ్య రైతులు మిర్చిని ఆరబోశారు. ఒక్కసారిగా గాలి రావడంతో పాటు వడగళ్లతో కూడిన వర్షం ప్రారంభమవడంతో రైతులు ఇంటి నుంచి మిర్చి కల్లాల వద్దకు వెళ్లి భద్రపర్చుకునే లోగానే తడిసి పోయాయి. మిర్చిపై పరదాలు కప్పుతున్న సమయంలో పైనుంచి పడుతున్న వడగళ్లు శరీరానికి ఇబ్బంది కరంగా మా రా యని రైతులు వాపోయారు. ఇటు మిర్చిని కాపాడుకోలేక, అటు వడగళ్ల నుంచి తప్పించుకోలేక ఇ బ్బందులు పడినట్లు తెలిపారు. మిర్చి తడవడతో భా రీగా నష్ట పోయామని అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్‌తీగలపై విరిగిపడిన చెట్టు

గాలివానకు మండల పరిధిలోని చెరుకూరు వద్ద చెట్టు విరిగి 33/11 కేవి విద్యుత్ తీగలపై పడింది. దీంతో మూడు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడగా ఐదు కాసారాలు విరిగి పోయాయి. ఏడు విద్యుత్ స్తంభాలు విరిగి పోవడంతో ధర్మవరం 33/11 కేవి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేదు. ఉదయం హుటాహుటిన విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో 10 మంది సిబ్బంది మరమ్మతు పనులను చేపట్టారు. రాత్రి వరకు పనులను పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నారు. ధర్మవరం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలకు తాగు నీరు, ఇతర అవసరాలకు ఇబ్బందులు కలుగకుండా వాజేడు సబ్‌స్టేషన్ నుంచి గుమ్మడిదొడ్డి ఫీడర్ ద్వారా సింగిల్ ఫేజ్‌పై విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మొండయ్య

మల్హర్: ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాడిచర్ల ఆధ్వర్యంలో తాడిచర్ల, పెద్దతూండ్ల, అడ్వాలపల్లి, దుబ్బపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రైతు పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు కేంద్రాల ద్వారా లభిస్తుందని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, డైరెక్టర్లు తిరుపతిరావు, కోఆప్షన్ మెంబర్ మెరుగు రాజయ్య, మాజీ ఎంపీపీ చింతల పల్లి మల్హల్‌రావు, మాజీ సర్పంచ్ రాజు నాయక్, నాయకులు బానోత్ కిషన్, కేసరపు చంద్రయ్య, పుప్పాల రాజు, మండల రాహుల్, ఆడువాల శ్రీనివాస్, మహేష్‌తో పాటు తదితరులు రైతులు పాల్గొన్నారు.

గిరిజనేతరులు ఏజెన్సీ నుంచి వెళ్లిపోవాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాటి నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

వాజేడు: ఏజెన్సీ ప్రాంతానికి వ్యాపారం నిమిత్తం వచ్చి స్థిరపడిన గిరిజనేతరులు వెంటనే వెళ్లిపోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాటి నాగరాజు అన్నారు. మండల పరిధిలోని మొరుమూరు కాలనీలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వచ్చిన గిరిజనేతరులు ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ప్రభుత్వ భూములను, ఆదివాసీల భూములను పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి వీరి భూములను సాగు చేసుకుంటూ భూ ప్రక్షాళన సమయంలో దొంగ సెటిల్‌మెంట్ ఆర్డర్ కాపీలను పొంది రాజకీయ నాయకులతో కుమ్మక్కై పట్టాలు పొందారని వాపోయారు. ఈ సమావేశంలో పోలిపోయిన కృష్ణారావు, తిరుపతి, రాజేష్, నర్సింహారావు, అఖిల్, సతీష్, విష్ణు, గౌతం, కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

కాటారం: మండలంలో వేర్వేరు చోట్ల బుధవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన శ్రీనివాస్ భూపాలపల్లి నుంచి బైక్‌పై వస్తున్న క్రమంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. శ్రీనివాస్ తలకు గాయమవగా చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే మండల కేంద్రానికి సమీపంలోని బొప్పారం క్రాస్ వద్ద బైక్, కారు ఢీకొన్న సంఘటనలో దంతలపల్లికి చెందిన పోషయ్యకు గాయాలయ్యాయి.

సాయి ప్రకాశ్ అంత్యక్రియలు పూర్తి

వెంకటాపురం(కె): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. సంస్థ సభ్యులు, యువకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సాయి ప్రకాశ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాని నినాదాలు చేశారు. సాయి ప్రకాశ్ వెంకటాపురం, వాజేడు మండలాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తు అందరికి సుపరిచితుడు కావటంతో అంత్యక్రియలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పిల్లలపై పర్యవేక్షణ అవసరం

ప్రారంభమైన వేసవి సెలవులు

- తీవ్రమైన ఎండలు



చలివాగులో ఈత కొడుతున్న చిన్నారులు(ఫైల్)

టేకుమట్ల: నేటి నుంచి పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులంతా సంతోషంతో గంతులు వేస్తున్నారు. కొందరు అమ్మమ్మ ఇంటికి, మరికొందరు బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు తిప్పటికే ప్రయాణాన్ని సిద్ధం చేసుకుని ఉంటారు. కానీ వేసవి సెలవుల్లో పిల్లలపై పర్యవేక్షణ అవసరమని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వేసవి ఎండలు విపరీతంగా పెరిపోవడంతో ఇన్ని రోజులు పాఠశాలలో గడిపిన విద్యార్థులు ఆటలపై దృష్టిపెట్టి మిత్రులతో కలిసి ఆటలు, షాపింగ్స్, ఈత కొలనుకు వెళ్లడం, తదితర వాటిపై దృష్టిపెడతారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు నిత్యం వారిని చూసుకుంటూ ఎండలో తిరగకుండా అప్రమత్తంగా ఉండాలి.

పెరిగిన ఉష్ణోగ్రతలు

ప్రస్తుతం 45డిగ్రీల ఉష్ణోగ్రతను దాటుతూ నమోదు కావడంతో పిల్లలు ఆడుకునే సమయంలో వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంటుంది. కావున ఉదయం, సాయంత్రం మాత్రమే ఆటలకు అవకాశం కల్పించాలి. అలాగే వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు సరదాగా ఈతకు వెళ్లడం వేసవిలో సహజం. కానీ ఈత రాని పిల్లలను తల్లిదండ్రులే దగ్గరుండి ఈత నేర్పడం లేదా, తగు జాగ్రత్తలతో ట్రైనీ ఈతగాళ్ల పర్యవేక్షణలో ఈత నేర్పించాలి.

టూర్‌లతో నూతనోత్సాహం..

పిల్లలతో కలిసి తల్లిదండ్రులు వేసవి సెలవులను సరదాగా గడిపేందుకు పుణ్యక్షేత్రాలు, సైన్స్ కేంద్రాలు, పార్కులకు వెళ్లడం వల్ల పిల్లల్లో నూతనోత్సాహం కలుగడమే కాకుండా వాటి విశిష్టతలపై అవగాహన కలిగి ఉంటారు. అలాగే ప్రయాణంలో ఎదురయ్యే మధుర జ్ఞాపకాలను తోటి పిల్లలతో పంచుకుని ఆనందంగా గడుపుతారు. అదే విధంగా వైజ్ఞానిక, కథల పుస్తకాలతో పాటు, రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలను సాయంత్రం వేళ చదివించడం, ట్యూషన్‌కి పంపించడం మంచిది. ఇలా నిత్యం పిల్లలపై అప్రమత్తంగా ఉంటే ఆనందంగా పిల్లలతో గడిపేయొచ్చు.

అప్రమత్తంగా ఉండాలి



వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లింద్రులు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. పిల్లలను ఎండలో తిరగనివ్వకుండా చూడాలి. తప్పకుండా తల్లిదండ్రుల సమక్షంలోనే పిల్లలకు ఈత నేర్పించాలి. స్నేహితులతో మాత్రం ఈతకు పంపిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ద్విచక్ర వాహనాలు మాత్రం అసలే ఇవ్వొద్దు. వేసవి సెలవులు ఆనందంగా గడపాలంటే పిల్లలను నిత్యం తల్లిదండ్రులు పర్యవేక్షించాలి.

– దాసరి సుధాకర్, ఎస్సై టేకుమట్ల

రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



మల్హర్: మండలంలోని వల్లెంకుంట, మల్లారం, చిన్నతుండ్ల గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఈ నెల 27న నిర్వహించే చలో వరంగల్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఊరు, వాడ కదలివచ్చి, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాస్ రావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీశ్, నాయకులు తాజొద్దీన్, యాదగిరి రావు, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అక్కినవేని సుమన్ పాల్గొన్నారు.